క్లుప్తంగా

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి



జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనకు గోడు చెప్పకుంటున్న కార్మికులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఘనీకృత వీర్య ఆబోతు కేంద్రంలో 30 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని, తమకు ఉండటానికి ఇళ్లు లేవని ఇంటి స్థలం ఇచ్చి అదుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజనకు కార్మికులు తమ గోడు చెప్పుకున్నారు. ఆబోతు కేంద్రంలో 50 మందికి పైగా పనిచేస్తున్నామని, తమకు రెండు సెంట్లు స్థలం ఇస్తే గుడిసెలు వేసుకుంటామని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ కార్మికులకు న్యాయం చేస్తానని పేర్కొన్నారు.

దేవరగట్టు హుండీ ఆదాయం లెక్కింపు



హుండీలోని కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

హొళగుంద: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.4,00,500 వచ్చినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. భక్తులు స్వామివారి హుండీలో సమర్పించిన కానుకలను నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామాలకు చెందిన కమిటీ సభ్యులు బుధవారం లెక్కించారు. హుండీలో దాదాపు 7 నెలలకు సంబంధించి కానుకలున్నట్లు చెప్పారు. హొళగుంద ఎస్‌ఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చేపట్టారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతులు

వెల్దుర్తి: ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకింగ్ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన ఉండాలని స్థానిక ఏపీజీబీ బ్రాంచ్ మేనేజర్ విజయభాస్కర్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బాలికల హైస్కూల్‌లో మండలంలోని విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై మండలస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఎంఈఓ ఇందిర, ఎంఈఓ–2 రమేశ్ ఆధ్వర్యంలో ముందుగా విద్యార్థినులకు బ్యాంకింగ్ సేవలను వివరించారు. పోటీల్లో కలుగొట్ల, సూదేపల్లె, కేజీబీవీ విద్యార్థినులు విజేతలుగా నిలిచి రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు అందుకున్నారు.

హాలహర్వి: కర్నూలు లీడ్ బ్యాంకు, కెనరా బ్యాంకు వారి సహకారంతో హాలహర్వి జెడ్పీ హైస్కూల్‌లో ఆర్థిక అక్షరాస్యతపై నిర్వహించిన క్విజ్ ప్రోగ్రాంలో గెలుపొందిన విద్యార్థులకు బుధవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అర్దగేరి, గూళ్యం, హాలహర్వి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు మొదటి మూడు స్థానాల్లో నిలిచి నగదు బహుమతులు గెలుపొందారు. నోడల్ ఆఫీసర్ జి.జగదీశ్వర్‌రెడ్డి, ఎంఈఓలు ఈరన్న, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

హొళగుంద: స్థానిక ఎస్‌బీఐ శాఖ ఆధ్వర్యంలో హొళగుంద జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో పాఠశాలకు చెందిన సందేశ్, రాఘవేంద్ర, ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలిచినట్లు ఎంఈఓ–2 జగన్నాథం, హెచ్ఎం నజీర్‌అహ్మద్ బుధవారం తెలిపారు. రెండవ స్థానంలో హెబ్బటం, గజ్జహళ్లి విద్యార్థులు నిలిచినట్లు వారు వెల్లడించారు. వారికి బ్రాంచ్ మేనేజర్ సతీష్ చేతుల మీదుగా ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ

చిప్పగిరి: సమష్టి కృషితోనే మండల అభివృద్ధి సాధ్యమని ఆలూరు మార్కెట్ యార్డు చైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఎంపీపీ జూటూరు హేమలత, మారయ్య అన్నారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జూటూరు హేమలత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాశాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఉపాది హామీ శాఖల పనితీరుపై ప్రజా ప్రతినిధులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.అధికారులు పనితీరు మార్చుకోవాలని ప్రజాప్రతినిధులు ఆదేశించారు. ఎంపీడీఓ సీవీ కొండయ్య, తహసీల్దారు లక్ష్మినారాయణ, వైస్ ఎంపీపీ నరసింహులు, సుజాత, సర్పంచులు గోవిందరాజులు, నీలకంఠ, సావిత్రి, నాగేంద్ర, ఎంపీటీసీలు సుంకన్న, భీమలింగ, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆదోనిలో 23న జాబ్‌మేళా

మద్దికెర: రిలయన్స్ ఫౌండేషన్ ఆర్డీప్ స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 23వతేదీ ఆదోనిలోని ఆస్పరి రోడ్, హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనుక వున్న జీవనజ్యోతి ఆశ్రమం ఎదురుగా ఉన్న ఆర్డీప్ సంస్థ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కట్టా భాస్కర్, కో–ఆర్డినేటర్ రాధారాణి బుధవారం తెలిపారు. డివిజన్‌లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బిగ్ బిస్కట్, ఐసీఐసీఐ, నవభారత్ ఫర్టిలైజర్స్, శ్రీసిటీ, కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 93984 07427, 91603 02039 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రజారోగ్యానికి భరోసా

- ఆరోగ్య శ్రీ ద్వారా విస్తృతంగా వైద్యసేవలు
- సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం
- వైద్య రంగానికి ప్రాధాన్యత



జి.వినోద్‌కు చికిత్స కోసం రూ.13 లక్షల ఎల్‌ఓసీ అందజేస్తున్న మంత్రి గుమ్మనూరు జయరాం (ఫైల్)



పత్తికొండ పర్యటనలో అనారోగ్యంతో బాధపడుతున్న ఈరన్న సమస్యను వింటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి (ఫైల్)



సీఎం ఆదేశాలతో హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆస్పత్రిలో ఈరన్నకు చికిత్స అందిస్తున్న దృశ్యం

ఆలూరు: ప్రజా సమస్యలు విని 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అని హామీ ఇచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక వాటిని నిజం చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారు. ప్రజారోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ పేదలు, బడుగు, బలహీన వర్గాల వారికి అన్ని విధాలుగా మేలు కలిగేలా ఆరోగ్య సేవలు విస్తృతం చేశారు. అలాగే గుండెజబ్బులు, లివర్, క్యాన్సర్, గర్భసంచి ఆపరేషన్లు, అల్లోజెనిక్ బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్, డయాలసిస్ ఇలా అనేక రకాల జబ్బులకు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా సాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి పట్టణ కేంద్రాల్లోని ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందిస్తూ వారికి ప్రాణం పోశారు. కిడ్నీ సమస్యలతో బాధపడుతున్న డయాలసిస్ రోగులకు పింఛన్ మొత్తాన్ని రూ 3,500 నుంచి రూ.పది వేలకు పెంచడంతో వారు వైద్యసేవలు పొందేందుకు ఆర్థికంగా భరోసా కల్పించడంపై లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

తండ్రి బాటలోనే..

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనల నుంచి పుట్టిన 108 అంబులెన్స్ ద్వారా రోడ్డు ప్రమాదాల బారిన పడినవారు, అత్యవసర వైద్యం అవసరమైన వారిని సకాలంలో ఆస్పత్రులకు చేర్చి ఉచితంగా వైద్యసేవలు అందించి ప్రాణదాతగా నిలిచారు, అలాగే ఆరోగ్య శ్రీద్వారా ఆపరేషన్లు అవసరమైన వారికి ఉంచితంగా చేయించి వారి మదిలో చెరగని ముద్రను వేసుకున్నారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు ఈ పథకానికి తగినన్ని నిధులు కేటాయించకపోవడంతో రోగులకు వైద్య సేవలు సక్రమంగా అందేవి కావు. ఈ స్థితిలో ప్రజా సంకల్పయాత్ర చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల కష్టాలను కళ్లారా చూశారు. 2019లో జగనన్న అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ వైద్య సేవలు విస్తృతం చేశారు. ఆరోగ్య శ్రీ పరిధి విస్తరణ, నాడు–నేడు ద్వారా ఆస్పత్రుల అభివృద్ధి, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఇంటి వద్దకే వైద్య సేవలు తదితర పథకాలతో ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించారు. ఆలూరు నియోజకవర్గంలో గత నాలుగేళ్లలో దాదాపు 4 వేల మంది వైఎస్సార్ ఆరోగ్య శ్రీ కోట్లాది విలువైన వైద్య సేవలు పొందారు. ఇటీవల పత్తికొండ పర్యటనకు వచ్చిన సీఎం జగన్ అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి సమస్యను విని తక్షణం మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. బాధితుడికి హైదరాబాద్‌లోని కాంటినెటల్ ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యం అందుతోంది. అలాగే జి.వినోద్ అనే బాధితుడికి చికిత్స కోసం రూ.13లక్షల ఎల్‌ఓసీని మంత్రి గుమ్మనూరు జయరాం అందించడంతో నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి.

ఆరోగ్య శ్రీ పేదలకు వరం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించింది. గుండె జబ్బుతో బాధపడుతున్న నాకు ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేయించి స్టంట్లు వేశారు. అలాగే నెలనెలా మందులు పంపిణీ చేస్తున్నారు. ఆరోగ్య శ్రీ పథకం నా ప్రాణాలను నిలబెట్టింది.

– పద్మావతి, ఆలూరు గ్రామస్తురాలు

ఆరోగ్యం కుదుటపడింది



నాకు తలనొప్పి, కళ్లు తిరగడం, వెన్నెముకలో నొప్పులు ఉండేవి. ఆస్పత్రికి వెళితే చేతిలో ఉన్న మొత్తం ఖర్చయ్యింది. అయితే డాక్టర్లు ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేస్తామని చెప్పారు. ఆపరేషన్ చేయించుకోవడంతో నా ఆరోగ్యం కుదుటపడింది. మాలాంటి పేదోళ్లకు నిజమైన దేవుడు జగనన్న.

– బోయ మద్దమ్మ, ఆలారుదిన్నె గ్రామస్తురాలు

అందరికీ వైద్య సేవలు



పీహెచ్ కేంద్రంలో చికిత్సలకు వచ్చే రోగుల అందరికీ అన్ని రకాల జబ్బులకు పరీక్షలు చేస్తాం. ఇక్కడ నయం కాని రోగాలున్న వారిని కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేస్తాం. పీహెచ్‌సీ కేంద్రాలకు వచ్చే రోగులకు చికిత్స చేసి మందులు అందించడంతో పాటు ఆర్యోగం జాగ్రత్తలు తెలియజేస్తున్నాం.

– మొలగవెల్లి పీహెచ్‌సీ వైద్యుడు, డాక్టర్ మారుతి

వాతావరణ పరిస్థితులతోనే మిర్చికి దెబ్బ



ఎదుగుదల లేని మిర్చి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాస్త్రవేత్త, అధికారులు

వెల్దుర్తి: వాతావరణ పరిస్థితుల కారణంగానే మిర్చి పైరు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్త, అధికారులు పేర్కొన్నారు. మండలంలో బోర్ల కింద సాగు చేసిన మిర్చి పైరులో ఎదుగుదల లేకపోవడం, తెగుళ్ల సోకి దెబ్బతినడంపై 'మిర్చి రైతు కన్నీరు' శీర్షికన ఈ నెల 19న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఉద్యాన శాఖ స్పందించింది. మహానంది వ్యవసాయ కళాశాల సీనియర్ ఉద్యాన శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం, జిల్లా ఉద్యాన శాఖాధికారి రామాంజనేయులు, కర్నూలు హెచ్ఓ విజయలక్ష్మి బుధవారం బోయనపల్లె, రామళ్లకోట ప్రాంతాల్లో మిర్చి పంటలను పరిశీలించారు. మేలో నాటిన మొక్కలు ఎదుగుదల లేక వైరస్ సోకి ఉండడాన్ని గుర్తించారు. పూర్తిస్థాయి విచారణ అనంతరం శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం, అధికారులు మాట్లాడుతూ.. పచ్చి మిర్చి సాగుకు మే అనుకూలం కాదని చెప్పారు. తీవ్రమైన ఎండలు, పొడి వాతావరణం, వర్షాల ఆలస్యం కారణంగా పంటకు ఆకుముడత వైరస్ సోకిందన్నారు. ఈ వైరస్ వ్యాప్తిలో భాగంగా తెల్లదోమ అధికంగా పడి మొక్కలు గిడసబారి, ఎదుగుదల లోపించిందని వివరించారు. రైతులు దుక్కిలో భాస్వరం వాడకపోవడంతో వేరు వ్యవస్థలో వృద్ధి లేదన్నారు. మిర్చి పైర్లను కాపాడుకునేందుకు రైతులకు తగిన సూచనలిచ్చారు. బెట్ట పరిస్థితులలో తెగుళ్ల తీవ్రత, పురుగుల ఉధృతి తగ్గించుకునే చర్యలు, అలాగే వర్షం పడిన తర్వాత మొక్క ఎదుగుదల కనిపిస్తే తీసుకోవాల్సిన చర్యలు, పిచికారీ మందులను వివరించారు. అనంతరం రామళ్లకోట నర్సరీలో పెంచుతున్న మిరప నారును పరిశీలించారు. మిర్చి పంట సాగుకు జూన్ అనుకూలమని రైతులు గుర్తించాలన్నారు. రామళ్లకోట ఆర్‌బీకే ఉద్యాన సహాయకుడు సాంబశివుడు, రైతులు ఉన్నారు.

యోగా డే

డివిజన్ వ్యాప్తంగా బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో యోగా శిక్షకులు విద్యార్థులు, ఉద్యోగులచే ఆసనాలు వేయించి యోగా ప్రాముఖ్యత, ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. యోగాతో మానసిక రుగ్మతలు తొలగిపోయి మానసిక ప్రశాంతత కలుగుతుందని వివరించారు. అబ్బురపరిచే యోగా ఆసనాలతో పలువురు ఆకట్టుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



కంబాలపాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థుల యోగా విన్యాసాలు



ఎమ్మిగనూరు బాలికల హైస్కూల్‌లో యోగా చేస్తున్న విద్యార్థినులు

కూలీల సంఖ్య పెంచాలి

నందవరం: గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ దశరథ రామయ్య ఉపాధి హామీ పథకం అధికారులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అధికారులు, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీఓ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు రోజువారి వేతనం రూ.272 అందించేలా పనులు కల్పించాలన్నారు. అలాగే పని దినాల సంఖ్య పెంచాలన్నారు. ఉద్యాన పంటలకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లు టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశించారు. మండలంలో 90 ఎకరాల్లో రైతులు ఉద్యాన పంటలు సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని, వారికి గుంతలు తవ్వే పనులు కల్పించాలన్నారు. ఉద్యాన పంటలపై ప్రభుత్వం 100 శాతం రాయితీ కల్పించిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీఓ శ్రీనివాసులు, ఈసీ నూర్జహాన్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

వెల్దుర్తి: మండల కేంద్రంలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను బుధవారం ఏఓ అక్బర్ బాష తనిఖీ చేశారు. స్టాకు, రిజిస్టర్లు, బిల్లు బుక్కులు తదితరాలు పరిశీలించారు. ఆయా దుకాణాలలో అమ్మకాలకు ఉంచిన వివిధ కంపెనీల పత్తి, కంది, ఆముదం, కరగాయలు తదితరాల విత్తనాలను తనిఖీ చేశారు. ఎమ్మార్పీకే అమ్మాలని, అనుమతిలేని విత్తనాలు అమ్మరాదని, లాట్ నంబర్ కనబరిచి బిల్లులివ్వాలని దుకాణదారులను ఆదేశించారు.

నలుగురికి షోకాజ్ నోటీసులు

హొళగుంద: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లను హెచ్చరించారు. బుధవారం ఆమె ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణ విషయంలో పురోగతి సాధించని గజ్జహళ్లి, చిన్నహ్యాట, ఇంగళదహాళ్, నెరణికి సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందించాల్సిన సేవలు ఇతర అంశాలపై ఉద్యోగులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. హౌసింగ్ ఇన్‌చార్జ్ డీఈఈ ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి



ఎమ్మిగనూరు 26వ వార్డులో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం పట్టణంలోని 26వ వార్డు పరిధి వీవర్స్‌కాలనీలో ఆ వార్డు కౌన్సిలర్ నీలకంఠ, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, అధికారులు, పార్టీ నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డు పరిధిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించి బుక్‌లెట్ అందజేశారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం జగనన్నకు మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టారంగయ్య, సునీల్‌కుమార్, నజీర్‌అహమ్మద్, యుకె రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని హాలహర్వి గ్రామ పంచాయతీలోని బాపురం గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నేత ఎర్రకోట జగన్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరు, అందిన సాయంపై ఆరా తీశారు. ప్రజా సమస్యలు తెలుసుకుని సత్వరం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నాయకులు శివారెడ్డిగౌడ్, లక్ష్మీకాంతరెడ్డి, విరుపాక్షిరెడ్డి, మునెమ్మ, హనుమంతమ్మ, ఎంపీడీఓ దశరథ రామయ్య, డీటీ రఘువీరా, ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న వెల్దుర్తి మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసకుమార్

తుగ్గలి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేక అధికారి జాకీర్ హుసేన్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ సావిత్రితో కలిసి ఆయన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈనెల 24 నుంచి ప్రతి ఇంటినీ వలంటీర్లు సందర్శించి ప్రజల సమస్యలు తెలుసు కోవాలన్నారు. జూలై 1 నుంచి మండల స్థాయిలో రెండు బృందాలతో కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రణాళిక తయారుచేసుకోవాలని సూచించారు.

'జగనన్న సురక్ష' నిర్వహణపై సమావేశం

వెల్దుర్తి: జూలై 1వ తేదీ నుంచి చేపట్టనున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి, ఎస్సీ కార్పొరేషన్ జిల్లా ఈడీ శ్రీనివాసకుమార్ ఆదేశించారు. బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ రాజేశ్వరి, ఎంపీడీఓ శ్రీనివాసరావ్, ఈఓఆర్డీ నరసింహులుతో కలిసి మండలంలోని సచివాలయ ఉద్యోగులతో సమావేశమయ్యారు. జగనన్న సురక్ష పథకం అమలు విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాల పురోగతిపై చర్చించారు. ఇళ్ల నిర్మాణానికి ముందుకురాని లబ్ధిదారులకు నోటీసులివ్వాలన్నారు. లబ్ధిదారులకు అవగాహన పెంచి ఇళ్లు నిర్మించుకునేలా చూడాలనిన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఈఓలకు వెంటనే మెమోలు జారీ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు.

కృష్ణగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేయనున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై గ్రామ స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీపీ డాక్టర్ కంగాటివ వెంకటరామిరెడ్డి ఆదేశించారు. మండల పరిధిలోని కంబాలపాడు గ్రామ సచివాలయంలో బుధవారం ఆయన వలంటీర్లు, గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 23 నుంచి నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

కృష్ణగిరి: జూలై 1వ తేదీ నుంచి నిర్వహించతలపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండలంలో పక్కాగా నిర్వహిద్దామని ఎంపీడీఓ విశ్వమోహన్, తహసీల్దార్ పురుషోత్తం పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వారు అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి కార్యక్రమం అమలుపై పలు సూచనలు చేశారు.పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

జాగ్రత్తలతో తెగుళ్ల నియంత్రణ

గోనెగండ్ల: తగిన జాగ్రత్తలు పాటిస్తే పత్తిపంటలో ఎర్రతెగులు, పచ్చ దోమ నియంత్రించవచ్చని ఎమ్మిగనూరు ఏడీఏ మహమ్మద్ ఖాద్రి, ఏఓ హేమలత పేర్కొన్నారు. బుధవారం గోనెగండ్లలో బోర్లు, బావుల కింద సాగుచేసిన పత్తిపంటలో ఎర్రతెగులును గుర్తించారు. వారు మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతల వల్ల పత్తిపంటకు ఎర్రతెగులు, పచ్చదోమ సోకి పంట నాశనం అవుతుందన్నారు. దీని నివారణకు 14:0:35 మందును ఒక లీటర్ నీటికి 5 గ్రాములు కలుపుకొని సాయంత్రం వేళల్లో పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఈ పిచికారీ తర్వాత ఐదు రోజులకు ఫార్ములేషన్ 4 లేదా ఫార్ములేషన్ 6లను ఒక లీటర్ నీటికి 5 గ్రాములు కలుపుకొని పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే రసం పీల్చే పురుగులైన పచ్చదోమకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మిల్లీ లీటర్‌కు ఒక లీటర్ నీటిని కలిపి సాయంత్రం వేళల్లో పిచికారీ చేయాలని సూచించారు.

బాధితులకు న్యాయం చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: పానకలదిన్నె గ్రామంలో ఓవర్గం వారిపై దాడిచేసిన మరో వర్గం వారిని రిమాండ్‌కు పంపి బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక డీఎస్పీ కార్యాలయం సమీపంలో ఆదోని రోడ్డుపై ప్రజా సంఘాల నాయకులు రాస్తారోకో చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సీతారామాంజనేయులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఆయా సంఘాల నాయకులు లక్ష్మినారాయణ, ఎర్రన్న, బతుకమ్మ, మారెప్ప, రంగయ్య పాల్గొన్నారు.

శ్మశాన సమస్య పరిష్కారం

గోనెగండ్ల: మండల పరిధిలోని బి.అగ్రహారం గ్రామంలో గత కొన్నేళ్లుగా ఉన్న శ్మశాన సమస్యను అధికారులు పరిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ గ్రామంలో 244 సర్వే నంబర్‌లో కొంత భూమిని శ్మశానానికి కేటాయించి బుధవారం బోర్డును ఏర్పాటు చేశామన్నారు. గతంలో ఉన్న శ్మశాన స్థలంపై కోర్టు వివాదం ఉన్న కారణంగా ప్రస్తుతం కొత్తగా శ్మశానాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు.

అవి-ఇవి

టాపర్లకు ప్రోత్సాహక బహుమతులు

కృష్ణగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగానికి పెద్దపీట వేశారని, పేద విద్యార్థుల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మోడల్‌స్కూల్‌లో ఆయన బుధవారం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పథకం కింద ప్రోత్సాహక బహుమతులు, సర్టిఫికెట్ అందజేశారు. ప్రిన్సిపాల్ నిర్మలాకుమారి, షేక్ షాలుమియ్యా పాల్గొన్నారు.

వీఓఏల నూతన కమిటీ ఎన్నిక

తుగ్గలి: ఏపీ వైఎస్సార్ క్రాంతి పథం వీఓఏల సంఘం తుగ్గలి మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బసవరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం మండలాధ్యక్షుడిగా పరంధాముడు, కార్యదర్శిగా లింగమయ్య, కోశాధికారిగా పార్వతి, ఉపాధ్యక్షులు రమణారెడ్డి, సహాయ కార్యదర్శిగా రవిని ఎన్నుకున్నారు. సంఘం జిల్లా నాయకులు రామలింగప్ప, మిన్నెల్ల పాల్గొన్నారు.

విత్తన విక్రయాల నిలిపివేత

పత్తికొండ రూరల్: పత్తికొండలోని రెండు ఎరువుల దుకాణాల్లో అనుమతి లేని పత్తి విత్తనాల విక్రయాలను నిలిపివేస్తూ ఏఓ వెంకట్రాముడు చర్యలు తీసుకున్నారు. బుధవారం స్థానిక ఆర్‌ఆర్‌ఆర్ ఆగ్రో ఏజెన్సీ, శ్రీ వెంకటరమణ ఫర్టిలైజర్స్, రవికిరణ్ ట్రేడర్స్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోర్స్ సర్టిఫికెట్ లేనందున విత్తనాలు అమ్మరాదని దుకాణదారులకు సూచించారు. కచ్చితంగా అనుమతి పత్రాలు తీసుకుని స్టాక్ విలువలను తెలియజేస్తూ, కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదులు ఇచ్చి వారి నుంచి సంతకాలు తీసుకోవాలని సూచించారు.

నాడు-నేడు పనుల పరిశీలన

మద్దికెర: మండల కేంద్రంలో నాడు– నేడులో భాగంగా రూ.16 లక్షలతో స్థానిక డీపీఈపీ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఇంజినీరింగ్ అసిస్టెంట్ విష్ణు పరిశీలించారు. ప్రభుత్వం కార్పొరేట్‌కు ధీటుగా ప్రభు త్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోంద న్నారు. నాణ్యత లేకుండా పనులు చేపడితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నిబంధనలకనుగుణంగా పనులు పూర్తి చేయాలని సూచించారు.

దళితులపై దాడులు అరికట్టాలి

ఆలూరు: ఉమ్మడి జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులను పోలీసు, రెవెన్యూ అధికారులు అరికట్టాలని జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు మహానంది, హత్తిబెళగళ్ లక్ష్మినారాయణ, గోపాల్ తదితరులు కోరారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో వారు బుధవారం మాట్లాడుతూ.. చిన్న విషయాలకు దళితులపై భౌతిక దాడులకు పాల్పడడం దారుణమన్నారు. ఇలాగే దాడు లు కొనసాగితే ఆందోళనకు దిగుతామన్నారు.

ఎంఈఓ-2 బాధ్యతల స్వీకరణ

ఆస్పరి: మండల విద్యాధికారి–2గా తిరుమలరావు బాధ్యతలు చేపట్టారు. ఆదోని మండలం మదిరి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా పని చేస్తున్న తిరుమలరావును ఎంఈఓ–2గా నియమిస్తూ జిల్లా విద్యాధికారులు అదేశాలు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎంఈఓ–2 తిరుమలరావు, ఎంఈఓ–1గా ఉన్న రాజేంద్రప్రసాద్‌ను ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు శాలువా, పూలమాలలతో సన్మానించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు

హాలహర్వి: మండలంలోని చింతకుంట గ్రామంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులను ఏఓ శివశంకర్ అందజేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్బీకేలో సర్పంచ్ ఆధ్వర్యంలో రెవెన్యూ, వ్యవసా య శాఖ సంయుక్తంగా కౌలు రైతుల గుర్తింపు గ్రామసభలను నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ గ్రామంలో 32 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించినట్లు తెలిపారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గుర్తింపు కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. వీఆర్వోలు విజయ్, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు

ఆస్పరి: అర్హులైన పేదలందరికీ పథకాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎంఎల్ఓ ప్రశాంత్ అన్నారు. బుధవారం ఆస్పరిలోని సచివాలయంలో జగనన్న సురక్ష పథకంపై వలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నుంచి వలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ పథకాలు, పత్రాలకు సంబంధించిన సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కావాల్సిన పత్రాలను సేకరించాలన్నారు. ఈ సమస్యలను మండల స్థాయి అధికారులు పరిష్కరిస్తారన్నారు. జూలై 1వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఈఓ రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోండి

నందవరం: రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ మఠ్రి స్రవంతి సూచించారు. బుధవారం నందవరంలో రైతు గొల్ల కృష్ణ పొలంలో మట్టి నమూనాలను ఆర్బీకే సిబ్బంది సేకరించి ల్యాబ్ టెస్టింగ్ కోసం ఎమ్మిగనూరుకు పంపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు భూసార పరీక్షల ఆధారంగా విత్తనాలు, ఎరువులు వాడాలన్నారు. మండలంలో 19 ఆర్బీకేల పరిధిలో కనీసం ఒక్కటి చొప్పున 22 మట్టి నమూనాలను సేకరించాలని సిబ్బందిని ఆదేశించారు. మట్టి నమూనాలను శాస్త్రవేతలు పరీక్షించి ఏ పంటలకు అనుకూలం, ఎలాంటి విత్తనాలు, ఎరువులు వాడాలో సూచనలిస్తారన్నారు. ఆయా ఆర్బీకేల వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

మద్దికెర: మద్దికెర పరిసరాలలో బుధవారం ఏఓ రవి ఆధ్వర్యంలో మట్టి నమూనాలు సేకరించి రైతులకు అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ఫలితాల వల్ల భూమిలో లభ్యమయ్యే పోషకాలు, వాడాల్సిన ఎరువుల గురించి తెలుసుకునేందుకు వీలవుతుందన్నారు. అవసరమైన మేరకు ఎరువులు వాడవచ్చన్నారు. వీఏఏ జాకీర్, రైతులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం, నిందితుడిని అరెస్ట్ చూపుస్తున్న సెబ్ సీఐ జయరాంనాయుడు

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని మాధవరం తండా క్రాస్ వద్ద బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న కర్నాటక మద్యాన్ని పట్టుకున్నట్లు సెబ్ సీఐ జయరాంనాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో పట్టుబడిన మద్యం, బైక్, నిందితుడిని అరెస్ట్ చూయించారు. ఆయన మాట్లాడుతూ.. మంత్రాలయం మండలం మాధవరం తాండా వద్ద సెబ్ పోలీసుల ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా ముగ్గురు యువకులు రెండు బైక్‌లపై కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. నిందితులు కోసిగి మండలం చిన్నబోంపల్లికి చెందిన నరసింహులు, కొలిమి గోవిందు, కోసిగికి చెందిన తలారి గోవిందును అరెస్ట్ చేసి 9 బాక్సుల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 9 బాక్సుల్లోని 864 టెట్రా ప్యాకెట్ల విలువ రూ.60 వేలు ఉంటుందని, అలాగే నిందితులు ఉపయోగించిన బైక్‌లను సీజ్ చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌గౌడ్, సెబ్ ఎస్ఐలు సోమశేఖర్ రావు, స్వామినాథన్, తదితరులు పాల్గొన్నారు.